# సుమిత్ర, ఊర్మిళల త్యాగనిరతి

*ప్రేమస్వరూపులారా!* అనంతమైన కాలములో మానవుడు అనేక విధములైన అనుభూతులను పొందుతున్నాడు. కాని, ఈ అనుభూతులన్నీ తాత్కాలికమైనవి. మానవుడు ధనమును కోల్పోతే విచారించనక్కర్లేదు. కోల్పోయిన ధనమును తిరిగి సంపాదించుకోవచ్చు. మిత్రుణ్ణి కోల్పోతే విచారించనక్కర్లేదు, మరొక మిత్రుణ్ణి సంపాదించుకోవచ్చు. అదేరీతిగా, పత్నిని కోల్పోతే పునర్వివాహమాడి మరొక పత్నిని పొందవచ్చు. భూమిని కోల్పోతే దానినికూడా తిరిగి సంపాదించుకోవచ్చు. కాని, శరీరమును కోల్పోతే దానిని తిరిగి సంపాదించుకోవడానికి వీలుకాదు. కనుక, శరీరము ఉన్నప్పుడే శాశ్వతమైన ఆనందాన్ని అనుభవించడానికి కృషి చేయాలి.

ధనేషణ, దారేషణ, పుత్రేషణ – ఈ మూడూ మానవుణ్ణి బంధితుని గావించి అనేక చిక్కులకు గురిచేస్తున్నాయి. ప్రాచీన కాలంలో ఎందరో రాజులు ఎంతో ధనమును ప్రోగుచేసుకున్నారు. కాని, ఏమి సాధించ గలిగారు? ధనము మానవుణ్ణి ఏనాటికీ ఉద్ధరించలేదు. ధనముచేత మానవుడు శాశ్వతమైన ఆనందమును పొందలేదు. ఆధ్యాత్మిక ధనమే నిజమైన ధనము. ధనమువలన తాను శాశ్వతమైన సుఖమును అనుభవించలేకపోయినప్పటికీ ధనముకోసం మానవుడు ఆరాటపడుతూనే ఉన్నాడు. ధనము అవసరమే. కాని, దానిని పరిమితంగా అనుభవించాలి. రెండవది దారేషణ. మానవుడు ధనమును సంపాదించి ఆలుబిడ్డలతో కలసి కొంతకాలం సుఖాన్ని అనుభవించవచ్చు. కాని, శాశ్వతసుఖాన్ని పొందగలననుకోవడం వెఱ్ఱితనం. అట్టి సుఖము అనిత్యమైనది, అసత్య మైనది. మూడవది పుత్రేషణ. మానవుడు తనకు పుత్రుడు కలగాలని ఆశిస్తాడు. ఆశించడంలో తప్పులేదు. అయితే, ధృతరాష్ట్రునకు అనేకమంది పుత్రులు కలిగారు. కాని, వారివల్ల తానేమి సుఖం పొందాడు? పుత్రులు లేనందువల్ల శుకునకేమైనా దుర్గతి కల్గిందా? లేదు. పుత్రులున్నవారు మాత్రమే సుఖపడతారని, లేనివారు కష్టపడతారని అనుకోవడం వట్టి భ్రమ. దుర్మార్గులైన పుత్రులు ఎంతమంది ఉన్నప్పటికీ ఏమి ప్రయోజనం? సత్పుత్రుడు ఒక్కడున్నా చాలు. దీనికి చక్కని ఉదాహరణ రామాయణం.

ఇది చైత్రమాసం, రాముడు అవతరించినది ఈనెలలోనే. చైత్రశుద్ధ నవమిరోజే శ్రీరామచంద్రుడు జన్మించాడు. దశరథమహారాజుయొక్క ముగ్వురు భార్యలలో రెండవ భార్యయైన సుమిత్రగురించిన ప్రస్తావన రామాయణంలో మనకంతగా కనిపించదు. రామునివల్ల కౌసల్యకు సత్కీర్తి కల్గింది. "కౌసల్యా సుప్రజా రామా..." అని సుప్రభాతంలో కౌసల్య పేరే మొట్టమొదట వస్తుంది. కైకేయి తన కుమారుడైన భరతుడే రాజు కావాలని ఆశించింది. కాని, సుమిత్రకు ఎలాంటి వాంఛలూ లేవు. ఆమె సద్గుణవంతురాలు, సదాచారసంపన్నురాలు, మితభాషిణి, హితభాషిణి; తన పేరుకు తగ్గ ప్రవర్తన గలది. ఆమె కుమారులైన లక్ష్మణ శత్రుఘ్నులకు రాజ్యాధికారం దక్కే అవకాశం లేదు. సుమిత్రకు అలాంటి కోరికకూడా లేదు. తన కుమారులిద్దరినీ సేవామార్గంలో ప్రవేశపెట్టి యావత్ ప్రపంచానికే ఆమె గొప్ప ఆదర్శాన్ని అందించింది. 'శ్రీరామచంద్రుడు రాజైనప్పుడు లక్ష్మణుడు అతనికి ప్రధాన సేవకుడుగా ఉండాలి' అని ఆశించింది. 'యజమాని ప్రక్కనే సేవకుడుంటాడు. నాకుమారునికి రామసేవయే ప్రధానమైనది. రామసేవలో లక్ష్మణుడు తరించాలి' అని

ఆశించింది. అదేవిధంగా, శత్రుఘ్నుడు భరతుణ్ణి సేవించాలని ఆశించింది. సేవలో ఉన్న పవిత్రతను గుర్తించి తన కుమారులను సేవకే అంకితం చేసింది. మీరు రామచరిత్రను చక్కగా విచారణ చేసినప్పుడు సుమిత్రయొక్క భావములెంత విశాలమైనవో, ఎంత ఘనమైనవో, ఎంత ఆదర్శవంత మైనవో అర్థం చేసుకోగలరు.

రాముడు అరణ్యానికి బయల్దేరేటప్పుడు  కౌసల్య చాలా దుఃఖించింది. కాని, సుమిత్ర మాత్రం కన్నీరు కార్చలేదు. పైగా కౌసల్యను ఓదార్చుతూ, "అక్కా! లక్ష్మణుడు రామునికి సేవ చేయ దానికి వెళుతున్నాడు; రాముణ్ణి కంటికి రెప్పవలె చూసుకుంటాడు. రామునికి ఎట్టి ఇక్కట్లుగాని, ఆపదలుగాని సంభవించవు", అని ధైర్యం చెప్పింది. "లక్ష్మణుడు రామునికి సేవ చేయడానికే పుట్టాడు. అతడు రాముని చేతిలో ఒక పనిముట్టు. కాబట్టి, రాముడు తన పనిముట్టును తనవెంట తీసుకువెళుతున్నాడు. అది నేను పంపడమూ కాదు, లక్ష్మణుడు వెళ్ళడమూ కాదు. లక్ష్మణుణ్ణి తన వెంట తీసుకువెళ్ళడానికి రామునికి అధికారమున్నది. అది అతని హక్కు", అని భావించింది. కనుకనే, ఆమె లక్ష్మణుణ్ణి ఆశీర్వదిస్తూ 'నాయనా! నీవు సీతారాములను చక్కగా సేవించు' అని బోధించింది. లక్ష్మణుడు సదా రాముణ్ణి అనుసరించినట్లుగా శత్రుఘ్నుడు ఎల్లప్పుడు భరతుని వెంట ఉండేవాడు. భరతుడు తన మేనమామయైన కేకయరాజు ఇంటికి బయలుదేరేటప్పుడు శత్రుఘ్నునికి ఉండమనిగాని, రమ్మనిగాని ఎలాంటి సమాచారమూ అందలేదు. కాని, భరతునికి సేవ చేసే నిమిత్తం అతనివెంట వెళ్ళడానికి శత్రుఘ్నుడు తనంతట తానే  సంసిద్ధుడయ్యాడు. ఈరీతిగా, తల్లియైన సుమిత్ర చేసిన సద్బోధల ఫలితంగా లక్ష్మణ శత్రుఘ్నులు సేవకే తమ జీవితాన్ని అంకితం గావించారు.

ఇంక, పత్నులు ఎలాంటివారు? రాముణ్ణి వీడి తాను క్షణమైనా ఉండలేనని సీత అరణ్యానికి బయలుదేరింది. లక్ష్మణుని భార్య ఊర్మిళ. సుమిత్రవలె ఈమె పేరుకూడా రామాయణంలో  ఎక్కువగా కనిపించదు. సుమిత్ర, ఊర్మిళ ఇరువురూ త్యాగమయమైన జీవితాన్ని గడిపిన వ్యక్తులు, ఆదర్శప్రాయులు. లక్ష్మణుడు సీతారాములవెంట తాను అరణ్యానికి వెళుతున్నానని చెప్పినప్పుడు ఊర్మిళ ఏమాత్రం విచారించలేదు. తన భర్త పధ్నాల్గు సంవత్సరాలపాటు తనను విడిచి అరణ్యానికి వెళుతున్నాడంటే, ఏభార్యయైనా ఊరుకుంటుందా? ఎన్ని ప్రశ్నలో వేస్తుంది. "అతనివెంట నీవు వెళ్ళవలసిన అవసరమేముంది? నీవు వెళ్ళాలనే నిబంధన ఏమీ లేదు కదా! కనుక, నీవు వెళ్ళ నక్కర్లేదు", అని వాదిస్తుంది. కాని, ఊర్మిళ లక్ష్మణునికి ఏమాత్రం అడ్డుచెప్పలేదు. "నాథా! సీతారాములను సేవించే భాగ్యం నీకు మాత్రమే లభించింది. నీవు చాలా అదృష్టవంతుడవు. ఇంక క్షణమైనా ఆలస్యం చేయకుండా బయలుదేరు", అని చెప్పింది. "ఊర్మిళా! ఇంక పధ్నాల్గు సంవత్సరాలపాటు నీవు సీతారాములను దర్శించడానికి వీలుకాదు కదా! కనుక, నీవు ఒక్కసారి వెళ్ళి సీతామాతను దర్శించుకొనిరా", అని చెప్పాడు లక్ష్మణుడు. కాని, ఊర్మిళ అక్కడి నుండి కదల్లేదు. "నాథా! నీవు సీతారాములవెంట వెళ్ళడానికి నావలన ఏమైనా అభ్యంతరం కలుగవచ్చు. కనుక, ఆలస్యం చేయక తక్షణమే బయలుదేరు. వారి సేవలో పాల్గొను. నీ పవిత్ర సేవలకు అడ్డురాకుండా ఉండే నిమిత్తం నేనిక్కడే ఉంటాను", అన్నది. ఆమె మాటలు విని లక్ష్మణుడు పట్టలేని ఆనందాన్ని పొందాడు. లోకంలో ఇంతటి త్యాగభావం కలిగిన పత్నులుకూడా ఉంటారా, అని అతడు ఆశ్చర్యపోయాడు.

యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు హనుమంతుడు సంజీవని మూలిక వున్న పర్వతాన్ని పెకలించి పట్టుకొని ఆకాశమార్గాన నందిగ్రామంమీదుగా వెళుతున్నాడు. భరతుడు అతనిని చూసి  ఎవరో రాక్షసుడని భావించి అంబులు ప్రయోగించాడు. తక్షణమే హనుమంతుడు పర్వతంతోపాటుగా క్రిందపడ్డాడు. భరతునికి నమస్కరించి, యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినాడని, అతనిని పునర్జీవితుణ్ణి గావించే నిమిత్తం తాను

సంజీవనిమూలికను తీసికొని వెళుతున్నానని చెప్పాడు. లక్ష్మణుడు మూర్ఛిల్లిన వార్త విని కౌసల్య దుఃఖించింది. కాని, సుమిత్ర ఏమాత్రం బాధపడలేదు. "లక్ష్మణుడు రామసేవ నిమిత్తం వెళ్ళినాడు. కనుక, అతనికి ఎట్టి ఆపదా సంభవించదు", అన్నది. దుఃఖంలో మునిగియున్న కౌసల్యకు ధైర్యం చెప్తూ "అక్కా! నీవు విచారించవలసిన విషయం కాదిది. రామునికి ఎలాంటి ఆపదా సంభవించదు. రామునికి సహాయంగా లక్ష్మణుడున్నాడు కదా! ఒకవేళ లక్ష్మణుడు శాశ్వతంగా కన్నుమూస్తే నా రెండవ కుమారుడైన శత్రుఘ్నుణ్ణి రామసేవకై పంపుతాను", అన్నది. ఏ తల్లియైనా ఇంతటి త్యాగానికి పూనుకోగలదా?

హనుమంతుడు ఊర్మిళతో "అమ్మా! రాముడు లక్ష్మణుణ్ణి తన రెండవ శరీరంగా, తన రెండవ ప్రాణంగా భావిస్తాడు. అలాంటి లక్ష్మణుడు మూర్ఛిల్లడంచేత రాముడు చాలా దుఃఖిస్తున్నాడు", అని చెప్పాడు. అప్పుడు ఊర్మిళ పక్కున నవ్వి, "హనుమంతా! శ్రీరాముని యొక్క తత్త్వమును, నా పతియైన లక్ష్మణునియొక్క స్వభావమును ఈ జగత్తులో ఎవ్వరూ గుర్తించలేరు. రాముడు సాక్షాత్తు పరమాత్ముడు. అతను విచారించవలసిన అవసరం లేదు. ఇదంతా కేవలం అతని లీలానాటకమే. ఇంక నా పతియైన లక్ష్మణుని విషయానికి వస్తే, అతని శరీరంలో అణువణువులోనూ, కణకణములోనూ రామనామమే నిండియున్నది. కనుక, అతనికెట్టి ప్రమాదమూ జరగడానికి వీల్లేదు. నిజానికి అది మూర్ఛకాదు. తాను హాయిగా, ప్రశాంతంగా నిద్రిస్తున్నాడు", అన్నది. హనుమంతుణ్ణి ఇంక క్షణమైనా ఆలస్యం చేయక బయల్దేరమని చెప్పింది. 'నేను జనక మహారాజు కుమార్తెను, దశరథమహారాజు కోడల్ని, లక్ష్మణుని భార్యను. కనుక, నాకెలాంటి భయమూ లేదు. నా భర్తకు ఎట్టి ఆపదా సంభవించదు', అన్నది.

ఊర్మిళ స్వభావం నిర్మలమైనది, నిత్యశుద్ధమైనది, నిస్స్వార్థమైనది. కాని, ఆమె గొప్పతనాన్ని ఈనాటివరకు భారతీయులే గుర్తించుకోలేదు. సుమిత్రగురించికూడా భారతీయులకు తెలియదు. ప్రజలు సీతారాములను మాత్రమే గొప్పగా వర్ణిస్తారుగాని, లక్ష్మణశత్రుఘ్నులు చేసిన సేవలను గురించి, వారి పత్నుల ఆదర్శంగురించి ఎవ్వరూ చెప్పుకోరు. కేవలం సీతారాములను స్మరిస్తే సరిపోదు; రాముని సోదరులు, వారి పత్నులు అందించిన ఆదర్శాలనుకూడా స్మరించాలి. దశరథుని పుత్రులు నల్గురూ నాలుగు వేదములవంటివారు. ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణ వేదములే రామలక్ష్మణ భరతశత్రుఘ్నుల రూపాలను ధరించి దశరథ మహారాజు ఇంట్లో ఆడుకున్నాయని వసిష్ఠులవారు వర్ణించారు.

ముఖ్యంగా మీరు గుర్తించవలసిందేమిటంటే, భగవంతునికి ఎట్టి ఆపదలూ సంభవించవు. లోకానికి ఆదర్శమును అందించే నిమిత్తం తాను ఈవిధమైన నాటకమాడుతుంటాడు. ఎవరి హృదయం పవిత్రంగా ఉంటుందో అట్టి మహనీయులకు మాత్రమే ఈ సత్యాన్ని గుర్తించడానికి వీలౌతుంది. లక్ష్మణునియొక్క పవిత్ర చిత్తమును ఒక్క ఊర్మిళ మాత్రమే కనిపెట్టగల్గింది. సుమిత్ర తల్లి కాబట్టి తన కుమారుల తత్త్వమును ఆమె అర్థం చేసుకోగల్గింది. సుమిత్రవంటి పవిత్రమైన మాతృమూర్తులు ఈనాడు ప్రపంచానికి అత్యవసరం. రామాయణమునందు తెలుపనటువంటి విషయాలు ఇంకా ఎన్నో చిత్రవిచిత్రమైనవి ఉన్నాయి.

ప్రేమస్వరూపులారా! ఈనాడు నూతన సంవత్సరం ప్రారంభమైనదని మీరు భావిస్తున్నారు. ఇది కాదు, ప్రతి క్షణం నూతనమైనదిగా మీరు భావించాలి. ఈ సంవత్సరంలో రాజకీయ వ్యాపార సామాజిక రంగాలలో పరిస్థితులు ఏ విధంగా ఉంటాయో, అని అనేకమంది వారివారి స్థాయిలను పురస్కరించుకొని అనేకవిధాలుగా ఊహాగానాలు చేస్తున్నారు. కాని, నిజం చెప్పాలంటే ఎట్టి మార్పులూ రావు. మార్పులకు క్రొత్త సంవత్సరం రానక్కర్లేదు. క్షణక్షణమూ ఎన్నో మార్పులు జరుగుతూనే ఉన్నాయి. కనుక, ఈ క్రొత్త సంవత్సరంలో గొప్ప మార్పులు ఏమి జరుగుతాయో, అని మీరు ఆలోచించనక్కర్లేదు. గడచిన సంవత్సరంలో ఏమి జరిగినాయో వచ్చే

సంవత్సరంలోకూడా అవే జరుగుతాయి. వాటినిగురించి కాదు మీరు ఆలోచించవలసింది. ఎన్ని సంవత్సరములు గడచినప్పటికీ మానవుడు తన పాడుబుద్ధులను వీడి పవిత్రమైన భావాలను అభివృద్ధిపరచుకోవడం లేదు. మొట్టమొదట దుర్గుణాలను, దురాలోచనలను త్యజించాలి. ఈ నూతన సంవత్సరంలో పవిత్రమైన భావాలను పెంచుకోవాలి. దృశ్యకల్పితమైన ఈ జగత్తును విస్మరించి అగోచరమైన ఆత్మతత్త్వాన్ని దర్శించి ఆనందాన్ని అనుభవించాలి.

ప్రేమస్వరూపులారా! సుఖముగాని, ఆనందముగాని మనకు ధనకనక వస్తువాహనాదులవలన లభ్యం కాదు. వ్యక్తులవలన అసలే లభ్యం కాదు. ఆనందము హృదయమునుండియే ఆవిర్భవిస్తుంది. కనుక, మీ దృష్టిని హృదయంవైపు మరల్చుకోండి. "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" అనే సత్యాన్ని గుర్తించండి. మానవుడు ఆనందపిపాసి. ఐతే, ఆనందాన్ని బయట వెతకనక్కర్లేదు. ఆనందము మన ఇంటనే, వెంటనే, జంటనే ఉన్నది. అంతర్దృష్టిని అభివృద్ధిపరచుకున్నప్పుడు ఆనందము మనం పిలువకనే ప్రత్యక్షమౌతుంది. మానవుడు భౌతిక సుఖాలకోసం ప్రాకులాడుతున్నాడు. ఏమిటీ సుఖాలు?

**మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవకగంప జాతసం**
**చలనముపొందు దుంప భవసాగరమీదగలేని కంప అం**
**బుంబులపొది లెమ్ము చూడ మన ముప్పుదలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.**

ఇలాంటి దేహముతో మనకు శాశ్వత సుఖము ఎలా లభిస్తుంది? హరి పాదములే మనకు శాశ్వత సుఖాన్ని అందిస్తాయి. హరిచింతనయే నిజమైన సుఖము. కాని, ఈనాడు భారతదేశంలో భక్తిప్రపత్తులు సన్నగిల్లుతున్నాయి. భౌతికమైన, ప్రాకృతమైన విషయాలపై మనస్సు భ్రమిస్తున్నది. ఏమిటీ భ్రమలు? ఏమిటీ సుఖాలు? ఇదంతా కేవలం బొమ్మలాటగా కనిపిస్తున్నది.

*ఈ లోకపు లీలానటన*
*ఒక బొమ్మల ఆటయె కాదా!*
*అతడొక రాజా, ఇతడొక కూలీ*
*కాదని ఎవరనినా అదేగా*
*అవునని ఎవరనినా ఇదేగా*
*లోకములోని పోకడ చూడ*
*ఈ గతి కాదా బాగా తెలియ*
*లోకములోని చీకటి చూడ*
*ఈ గతి కాదా బాగా తెలియ...*

లోకంలో అంతా చీకటే. అదే అజ్ఞానము. ఇది కేవలం తమోగుణ ప్రభావమే. తమోగుణంలో జీవిస్తూ సాత్వికతత్త్వాన్ని గుర్తించాలంటే ఎలా సాధ్యమౌతుంది?

అనాదికాలమునుండి మన భారతదేశము ఎంతో పేరుప్రఖ్యాతులు గాంచినది. భారతదేశానికి ఉత్తరదిశన హిమాలయపర్వతములు ఎల్లలుగా ఉన్నవి. హిమము తెల్లనైనది, చల్లనైనది. కనుక, హిమాలయములు పవిత్రతకు, ప్రశాంతతకు చిహ్నములు. భక్తిజ్ఞానవైరాగ్యములకు ప్రతీకలైన గంగాయమునాసరస్వతులు ఈ పవిత్రమైన భారత దేశమునందు ప్రవహిస్తున్నాయి. ఇంతియేకాదు. రామాయణ, భారత, భాగవతములనే పవిత్ర గ్రంథాలను లోకానికి అందించినదీ దేశం. సర్వవ్యాపకమైన ఏకత్వాన్ని ప్రబోధించే భగవద్గీత ఆవిర్భవించిన

పుణ్యభూమి ఈ భరతభూమి. "అహింసా పరమో ధర్మః" అని ప్రబోధించిన బుద్ధుడు జన్మించిన పవిత్రభూమి ఇది. భారతదేశ చరిత్ర ఎంత గొప్పదో, ఎంత దివ్యమైనదో మీరు గుర్తించాలి. అనాదికాలమునుండి భారతదేశము ఆధ్యాత్మికతత్త్వ ప్రచారంచేత అన్ని దేశములకూ శాంతిభద్రతలను అందిస్తూ వచ్చింది.

ప్రేమస్వరూపులారా! భారతదేశంలో పుట్టడమనేది ఎంతో గొప్ప అదృష్టం. భారతదేశంలో జీవించడం మరింత గొప్ప అదృష్టం. కాని, భారతదేశంయొక్క గొప్పతనాన్ని భారతీయులే మరచిపోతున్నారు. "నేను భారతీయుడను," అని మీరు సగర్వంగా చాటుకోవాలి. ఇదే మీకున్న గొప్ప డిగ్రీ. భారతీయుడనే పదముయొక్క అంతరార్థమును మీరు గుర్తించి వర్తించాలి. భారతీయులారా! మీరు ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపి ఆనందాన్ని అనుభవించి, ఆ ఆనందాన్ని అన్ని దేశములవారికీ అందించడానికి కృషిచేయాలి. ప్రాచీనకాలమునుండి మానవతా విలువలను ఆచరించి, ప్రపంచానికి ఆదర్శాన్ని అందించిన మహనీయులెందరో మన భారత దేశములో జన్మించారు. ఆ మహనీయులయొక్క ఆదర్శాలను, వారి పవిత్రమైన చరిత్రలను మీరు మరువకూడదు. ఏదో పాతపురాణాలని వాటిని ప్రక్కన పెట్టకూడదు. వాటిలో ఉన్న మహత్తరమైన విషయాలు మీకు అంత సులభంగా అర్థం కావు. మీరెంతో కాలమునుండి రామాయణమును చదువు తున్నారు. కాని, సుమిత్రయొక్క సద్భావములను, ఊర్మిళయొక్క పవిత్రతను ఏమైనా అర్థం చేసుకోగలిగారా? లేదు. ఊర్మిళ జనకమహారాజు యొక్క స్వంతబిడ్డ. సీత భూమిని దున్నేటప్పుడు దొరికిన బిడ్డ. ఆమె శక్తిస్వరూపిణి. సీత భూజాత కాబట్టి ఆమెలో నూటికి నూరుశాతం Magnetic Power (ఆకర్షణశక్తి) ఉన్నది. రాముడు పరమాత్మ కాబట్టి, అతనిలోకూడా ఆకర్షణశక్తి పరిపూర్ణంగా ఉన్నది. కనుకనే, జనకుడు సీతను రామునికిచ్చాడు. ఊర్మిళను లక్ష్మణునికిచ్చాడు. లక్ష్మణుడెవరు? ప్రపంచాన్నే మోసే ఆదిశేషుడు. ఊర్మిళ గొప్ప గుణవంతురాలు. ఈనాడు ప్రజలు కైక పేరు, మంథర పేరు జ్ఞాపకం పెట్టుకుంటారుగాని, ఊర్మిళ పేరును ఎవ్వరూ జ్ఞాపకం పెట్టుకోరు. ఊర్మిళస్వభావం చాలా సున్నితమైనది. పతి అరణ్యానికి వెళ్ళే సమయంలో తాను ఏ గదిలో ఉన్నదో అతను తిరిగి వచ్చేంతవరకు ఆ గదిలోనే ఉంది. "నాథా! నీవు పధ్నాల్గు సంవత్సరాల తరువాత తిరిగి వచ్చేంతవరకు నేనిక్కడే ఉంటాను," అని చెప్పింది. ఆమె చిత్రకళలో ప్రవీణురాలు. తన సమయాన్నంతా చిత్రకళకే వినియోగించింది. దృశ్యకల్పితమైన జగత్తుపై ఆమె ఎలాంటి కోరికలూ పెట్టుకోలేదు. నేను చెప్పవచ్చునుగాని, అందరూ అర్థం చేసుకోలేరు. సీత పట్టాభిషేకంకోసం పసుపుపచ్చని చీర కట్టుకున్నది. ఆ చీరతోనే అరణ్యంలో పధ్నాల్గు సంవత్సరాలున్నది. ఊర్మిళకూడా అంతే. లక్ష్మణుడు తనను వదలిపెట్టి వెళ్ళే సమయంలో ఏ చీర ధరించిందో పధ్నాల్గు సంవత్సరాల తరువాత అతను తిరిగి వచ్చేంతవరకు అదే చీరతో ఉన్నది. దేహభ్రాంతి లేనటువంటివారు జనకుని బిడ్డలు. జనకుడు దేహాభిమానం లేనటువంటి వాడు కనుకనే, అతనికి వైదేహరాజు అని పేరు వచ్చింది.

రామాయణంలో నిగూఢమైన అంతరార్థములున్నాయి. కాని, భారతీయులుకూడా వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం లేదు. రామాయణమంతా చదివిన తరువాత ఒక వ్యక్తిని సీత ఎవరి భార్య అని అడిగితే 'మిసెస్ రామ' అని చెప్పినాడట! అంతటి అజ్ఞానంలో మునిగియున్నారు భారతీయులు; ఆధునిక నాగరికతపై మోజు పెంచుకొని ప్రాచీన చరిత్రను, సంస్కృతిని విస్మరిస్తున్నారు; తమ ప్రవర్తనచేత దేశంయొక్క పేరుప్రఖ్యాతులనుకూడా పాడు చేస్తున్నారు. మనకున్నది ఒకే ఒక మిత్రుడు; అతడే భగవంతుడు. మనకున్నది ఒకే ఒక గ్రంథము; అదే భారతదేశచరిత్ర. దానినే మనం చదవాలి. పిచ్చిపిచ్చి నవలలను చదివి మీ హృదయాన్ని పాడుచేసుకోవద్దు. హృదయాన్ని పరిశుద్ధం గావించుకున్న వ్యక్తికే పవిత్రమైన భావములు కల్గుతాయి.

ప్రేమస్వరూపులారా! ఈ నూతన సంవత్సరమునుండి మీరు పవిత్రమైన రామచరిత్రలో ఉన్న ఆదర్శప్రాయులైన స్త్రీ, పురుషుల సద్గుణాలను మీ హృదయంలో నిల్పుకొని, వారి అడుగుజాడలలో నడవడానికి ప్రయత్నించండి. భారతదేశ పవిత్రతను ప్రపంచానికి చాటిచెప్పండి. భారతదేశం మన మాతృభూమి. ఇట్టి

పవిత్రభూమిని మీరెన్నటికీ మరువకూడదు. “అయ్యా, నీవెవరు?” అని ఎవరైనా మిమ్మల్ని అడిగితే, “నేను రామయ్యను”, “నేను కృష్ణయ్యను”, “నేను గోవిందయ్యను” అని చెప్పుకోనక్కర్లేదు. “నేను భారతీయుణ్ణి” అని సగర్వంగా చాటుకోవాలి. అదొక్కటే చాలు మనకు. రామయ్య, కృష్ణయ్య, గోవిందయ్య... ఇవన్నీ పెట్టిన పేర్లు. భారతీయుడనేది పుట్టిన పేరు. భారతీయుడనగా ఎవరు? ‘భా’ – ‘రతి’. ‘భా’ అనగా కాంతి, ప్రకాశము, దివ్యత్వము. కనుక, దివ్యత్వాన్ని ప్రేమించేవాడే భారతీయుడు. భారతదేశంలో లేనిది మరే దేశంలోనూ లేదు. భారతదేశమునకు వచ్చిన కీర్తి, ప్రతిష్ఠలు మరే దేశమునకూ రాలేదు. అట్టి పేరు, ప్రఖ్యాతులను మనం నిలబెట్టాలి.

ప్రేమస్వరూపులారా! రామాయణములో ఎన్నో గొప్పగొప్ప విషయా లున్నాయి. మన ప్రాచీన చరిత్రలెన్నో మరుగునపడిపోయాయి కాని, అనేక వేల సంవత్సరాల తరువాతకూడా రామచరిత్ర ఇంకా నిత్యనూతనంగా ప్రకాశిస్తూనే ఉంది. ‘రామ’ అనేది వసిష్ఠులవారు పెట్టిన పేరు. ఈ నామంలోనే ఉన్నది గొప్ప మాధుర్యం. ‘రామ్, రామ్...’ అని జపించడంలో ఉన్న అంతరార్థమేమిటి? ‘రా’ అని నోరు తెరచినప్పుడు లోపల ఉన్న దుర్గుణాలన్నీ బయటపడిపోతాయి. ‘మ్’ అని నోరు మూసుకున్నప్పుడు బయటపడిన దుర్గుణాలు తిరిగి లోపలికి రాకుండా ఉంటాయి. రామ నామాన్ని జపించడంలో ఇంత గొప్ప అంతరార్థమున్నది. ఇది క్రొత్త సంవత్సరం. కనుక, క్రొత్త విషయాలను తెలుసుకున్నారు. వీటిని ఆచరణలో పెట్టి మీ జీవితాన్ని సార్థకం గావించుకోండి.

ప్రవహించు నేపురి పరిధిగా పాయలై
చిత్రావతీనది విచిత్రగతులు
క్రాలు నేపట్టణ కల్యాణకరముగా
చుట్టును మేలైన చూతతరులు
కాపుండు నేపురి కడల నాల్గిటియందు
పార్వతీశ్వరులెప్డు బాయకుండ
కొలువుండు నేపురి విలసితంబగు మధ్య
మహిమాన్వితుండైన మాధవుండు
మండలావని గణుతించు మెండు మహిమ
చిక్కవడియరు కట్టిన చెఱువుతోడ
బుక్కరాయల చిరకీర్తి భువనమెంచ
పొసగ చాటు నేపురము ఆ పుట్టపురము

పుట్టపర్తి అంటే ఏమిటి అర్థము? పర్తి అనగా, ప్రకాశము. పుట్టినటువంటి ప్రకాశమే పుట్టపర్తి. పూర్వం దీనికి ‘పుట్టవర్థిని’ అని పేరు. ఎక్కడ చూసినా పుట్టలు పెరిగేవి, పాములు సంచరించేవి. దానివల్లనే ఆ పేరు వచ్చింది. రామాయణం రచించిన వాల్మీకి ఎక్కడివాడు? పుట్టలోనుండి పుట్టినటు వంటివాడే. అతనిపైన పుట్టలుపెరిగాయి, పాములు సంచరించాయి. కనుక, పుట్టలనుండి పుట్టినటువంటిదే రామాయణం. మీ హృదయమనే పుట్టలో దుర్గుణములు, దురాచారములు అనే పాములున్నాయి. అవన్నీ బయట పడిపోవాలంటే మీరు భగవన్నామస్మరణ చేయాలి. నాదస్వరం వినిపిస్తే పుట్టలోని పాములన్నీ బయటికి వచ్చినట్లుగా, మీరు నామస్మరణ చేస్తే మీ హృదయంలోని దుర్గుణాలన్నీ తొలగిపోతాయి.

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలం
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతి రన్యథా

నామస్మరణ చాలా పవిత్రమైనది. ఈనాడు నామస్మరణ తగ్గిపోవడం చేతనే దేశంలో బాధలు పెరిగిపోతున్నాయి. వీధివీధియందు నామస్మరణ చేయండి. శరీరంలోని అణువణువునూ, కణకణమునూ భగవన్నామముతో నింపుకోండి. నామస్మరణవలన కలిగే ఆనందము, ధైర్యసాహసాలు ఇంక దేనివల్లనూ లభించవు. ఇతరులేమనుకున్నా ఫరవాలేదు, అపహాస్యం చేసినా పట్టించుకో నక్కర్లేదు. "ఇతను ఐ.ఎ.యస్. ఆఫీసర్ కదా! ఇతనుకూడా నామస్మరణ చేస్తున్నాడే", అని కొందరనుకోవచ్చు. నామస్మరణ చేయడానికి ఎవరైతేనేమి? హృదయం అందరికీ ఒక్కటే కదా! ఐ.ఎ.యస్. ఆఫీసరైతే నామస్మరణ చేయకూడదా? ఎవరైనా సరే, చిన్నవారైనా, పెద్దవారైనా, బీదలైనా, ధనికులైనా అందరూ దైవనామాన్ని స్మరించాలి. తెలియని మూర్ఖులు అపహాస్యం చేయవచ్చునుగాని, బుద్ధి ఉన్నవారెవ్వరూ అలా చేయరు. ఎవరైనా మీవద్దకు వచ్చి "ఏమిటయ్యా, నీవుకూడా దేవుణ్ణి నమ్ముతున్నావా? నీవుకూడా నామస్మరణ చేస్తున్నావా?" అని అడిగితే "అవును, నేనేమైనా దైవనామాన్ని స్మరించలేనంత గొప్పవాడినా? నేనే కాదు, నీవు, నీ తండ్రి, నీ తాత, నీ ముత్తాత అందరూ నామస్మరణ చేయవలసిందే", అని సమాధానం చెప్పాలి. "నీవు నామస్మరణ చేయకపోతే ఇంక మానవుడవై పుట్టి ప్రయోజనమేమిటి?" అని ప్రశ్నించాలి. "నాకు దైవంపై నమ్మకం లేదు", అంటాడు. "నీకు లేకపోతే నీవు వదలిపెట్టు. నాకు నమ్మకముంది. నీ దేవుడు నీకు లేకపోవచ్చు. కాని, నా దేవుడు నాకు లేడని చెప్పడానికి నీవెవరు?" అని గట్టిగా బుద్ధి చెప్పాలి. దృఢమైన విశ్వాసంతో నామస్మరణ చేసినప్పుడు మీరు అన్నింటిలోనూ విజయాన్ని సాధిస్తారు. భయాన్ని ప్రక్కకునెట్టి నిర్భయంగా నామస్మరణ చేయండి. అప్పుడే మీరు ఆనందాన్ని అనుభవించగలరు. మీవద్ద సంగీతపరికరాలు లేకపోయినా ఫరవాలేదు, హృదయపూర్వకంగా నామాన్ని స్మరిస్తే చాలు. మీ మనస్సే ఒక వీణ. అందులో చెడ్డభావాలనే 'అపస్వరాలు' రాకుండా చూసుకోండి. మనస్సనే వీణపై పవిత్రమైన భగవన్నామాన్ని పలికిస్తూ మీ జీవితాన్ని గడపండి. అప్పుడే మీకు భగవదనుగ్రహప్రాప్తి కల్గుతుంది. ఈ నూతన సంవత్సరంలో మీరు ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపి, ధన్యులై, పుణ్యులై ఆనందాన్ని అనుభవిస్తారని నేను ఆశిస్తున్నాను. ఆనందంకోసం మీరు బయట వెతకనక్కర్లేదు. మీయందే ఉన్న ఆనందాన్ని ఆవిర్భవింపజేసుకోండి. భక్తిప్రపత్తులను అభివృద్ధిపరచుకోండి. మీరు భారతీయులై పుట్టినందుకు ఆ పేరును నిలబెట్టుకోండి. ఇతర దేశములన్నీ త్వరలోనే భారత దేశాన్ని అనుసరిస్తాయి. మన భారతదేశం ఆధ్యాత్మికరంగంలో అన్ని దేశములకూ నాయకత్వం వహించాలి. ఇదే నేను ఆశించేది.

నిన్నటిదినం తెలుగువారు ఉగాదిని జరుపుకున్నారు. ఈనాడు తమిళ ప్రజలకు క్రొత్తసంవత్సరం ప్రారంభమైంది. కేరళ ప్రజలు దీనికి 'విషు' అని పేరు పెట్టుకున్నారు. పేర్లు వేర్వేరుగాని, అంతరార్థం ఒక్కటే. మీరు అంతరార్థాన్ని గుర్తించి వర్తించినప్పుడే ఈ పండుగలను సరియైన రీతిలో జరుపుకున్నవారవుతారు.

(2002 ఏప్రియల్ 14వ తేదీ ఉదయం సాయిరమేశ్ హాల్ (బృందావనం)లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)